# సీతక్క మీటింగ్‌లో పవర్ కట్

- 20 నిమిషాలపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం
- చీకట్లోనే కొనసాగిన ప్రసంగం
- కాంగ్రెస్ సర్కార్ పవర్ పాలసీ తీరిది

వరంగల్, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతలు నిత్యకృత్యంగా మారాయి. సాక్షాత్తూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్న ముఖ్యమైన సమావేశంలోనే 20 నిమిషాలు కరెంటు పోయింది. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతుండగా 20 నిమిషాలు కరెంటు కట్ అయ్యింది. వరంగల్ నడిబొడ్డున ఉన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియం ఏరియాలో ఆదివారం మంత్రి పాల్గొన్న కార్యక్రమంలోనే కరెంటు పోవడంపై పలువురు సర్కార్ తీరును తప్పుబట్టారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక తరపున మంత్రి సీతక్కకు నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎఫ్ఐఆర్ నమోదైన వారినే కాకుండా కేసులు నమోదుకాని ఉద్యమకారులు ఎంతో మంది ఉన్నారని, వీరిని ఉద్యమకారులుగా గుర్తించాలని కోరారు. ఉద్యమకారుల వేదిక ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారుల ఆకాంక్షలను గుర్తించి, వారి ఆశయాలను అమలుకు కృషి చేస్తామని చెప్పారు. మంత్రి సీతక్క అధికారులతో ఫోన్లో మాట్లాడగా చివర్లో కరెంట్ రావడంతో అందరూ చప్పట్లు కొట్టారు.

# మరో ఆటో డ్రైవర్ హఠాన్మరణం

**గిరాకీలేక మనోవేదనతో కుప్పకూలిన రమేశ్ • కరీంనగర్ జిల్లా దుర్శేడ్‌లో విషాద ఘటన**

కరీంనగర్ రూరల్: ఫిబ్రవరి 18: రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల మరణాలు ఆగడం లేదు. గిరాకీ లేక పూట గడవక గుండెపోటుతో మరణిస్తున్నారు. ఈ రెండు నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో ఆటో డ్రైవర్లు ప్రాణాలు విడిచారు. తాజాగా కరీంనగర్ జిల్లాలో ఓ ఆటో డ్రైవర్ గుండెపోటుతో కుప్పకూలాడు. కరీంనగర్ జిల్లా దుర్శేడ్‌కు చెందిన పూదరి రమేశ్‌గౌడ్ (40) పదహారేండ్లుగా ఆటో నడుపుతూ భార్యాబిడ్డలను, వృద్ధులైన తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలో జనాలు ఎక్కడం లేదు. దీంతో నెలవారి కిస్తీలు కూడా చెల్లించడంలేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఛాతీలో నొప్పివస్తుందంటూ ఇంట్లోనే కుప్పకూలాడు. కుటుంబసభ్యులు గమనించి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశాడు. ఇంటి పెద్దదిక్కు మృతితో తల్లిదండ్రులు లచ్చవ్వ, మల్లయ్య, భార్య స్వరూప, కొడుకులు అరుణ్, తరుణ్ భోరున విలపించారు. తమకు దిక్కెవరూ అంటూ కన్నీరు మున్నీరయ్యారు. రమేశ్‌గౌడ్ మరణానికి కాంగ్రెస్ సర్కారే బాధ్యత వహించాలని కరీంనగర్ చల్మెడ, దుర్శేడ్ ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. తక్షణమే రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు.



రమేశ్‌గౌడ్ (ఫైల్)

# మళ్లీ రోడ్లపైకి ప్లాస్టిక్ బిందెలు!

- మూడు రోజులుగా నిలిచిన భగీరథ నీటి సరఫరా
- అలంపూర్‌లో బోరు వద్ద కాలనీవాసుల అవస్థలు

అలంపూర్, ఫిబ్రవరి 18 : కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు నీటికష్టాలు రాకుండా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా ద్వారా మంచి నీటిని అందించింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే, అదీ వేసవి రాకముందే నీటికి కటకట ఏర్పడింది. పాలకులు, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నీటి ఎద్దడి ఏర్పడుతున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలోని 9వ వార్డులోగల న్యూ ప్లాట్స్ కాలనీకి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో మూడు రోజులుగా కాలనీకి నీళ్లు రావడం లేదు. మరమ్మతులు చేస్తున్నామని చెబుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో కాలనీ మొత్తానికి ఉన్న ఒక్క బోరు వద్ద నీటిని పట్టుకునేందుకు ప్రజలు క్యూ కడుతున్నారు. ఒక్క బిందె నీటి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. పనులు వదులుకొని నీటికోసం సమయం కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు చొరవ తీసుకొని నీటి కొరత నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎయిర్‌వాల్స్ లేకపోవడంతోనే పదేపదే పైపులు పగులుతున్నాయని మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు. కాగా పట్టణంలోని 3, 4, 6వ వార్డుల్లోనూ నీటి ఎద్దడి నెలకొన్నది.

## రేవంత్‌రెడ్డిది నియంతృత్వ పాలన

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత నియంతృత్వ పాలన సాగిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ విమర్శించింది. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకత్వంపై అక్రమంగా మోపిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తివేయాలని ఒక ప్రకటనలో ఆ పార్టీ డిమాండ్ చేసింది. అన్నలు రావాలి.. నక్సలైట్ల అవసరం మళ్లీ వచ్చింది.. అని అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇంద్రవెల్లి సభలో రేవంత్‌రెడ్డి ప్రకటించారని, కానీ అందుకు విరుద్ధంగా పూసపల్లి కుట్ర కేసు నమోదు చేశారని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

## బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చడం ఖాయం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): బీజేపీ మూడోసారి గెలిస్తే భారత రాజ్యాంజాన్ని మార్చటం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దేశానికి బీజేపీ, పీఎం మోదీ, అమిత్ షా శత్రువులని దుయ్యబట్టారు. విభజన హామీలు నెరవేర్చకుండా అటు తెలంగాణకు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఇటు ఏపీకి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రేపటి నుంచి బీజేపీ బస్సుయాత్రలు

- నేడు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్దప్రచార రథాలకు పూజలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): ఈ నెల 20 నుంచి బీజేపీ బస్సు యాత్రలను ప్రారంభించనున్నది. ఈ నేపథ్యంలో సోమవారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రచార రథాలను ప్రారంభించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

# గత ప్రభుత్వాల నిర్ణయాలు కొనసాగిస్తం

- హైదరాబాద్ అభివృద్ధిలో కేసీఆర్, చంద్రబాబు, వైఎస్ పాత్ర కీలకం
- వారి అనుభవాల్లో మేం సాగుతాం
- ప్రపంచంతో హైదరాబాద్ పోటీ
- పెట్టుబడులకు అనువైన ప్రాంతం
- రాష్ట్ర అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్
- అగ్నిమాపకశాఖ కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్



నానక్‌రామ్‌గూడలో రాష్ట్ర అగ్నిమాపక విభాగం ప్రధాన కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): 'మతకల్లోలాల నుంచి తెలంగాణను, హైదరాబాద్‌ను గత ప్రభుత్వాలు బయటపడేశాయి. ఈ రోజు గొప్ప స్థాయిలో మన హైదరాబాద్ నగరాన్ని నిలిపాయి. చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ వంటి వారి రాజకీయాలు ఎలా ఉన్నా.. హైదరాబాద్ నగర అభివృద్ధి విషయంలో ఎవ్వరూ రాజీపడలేదు. అందుకే గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను కొనసాగిస్తాం. అందరి అపోహలు తొలగిస్తాం. వారి ముగ్గురి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని.. హైదరాబాద్‌ను వేగంగా నడిపించేందుకు మా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నానక్‌రామ్‌గూడలో రాష్ట్ర అగ్నిమాపక విభాగం ప్రధాన కార్యాలయ భవనాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. దేశానికి ఆదాయం అందించటంలో తెలంగాణ రాష్ట్రం కీలకంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ సహా అన్ని జిల్లాలు మౌలిక వసతులు, నిర్మాణ రంగంలో దూసుకుపోతున్నాయని పేర్కొన్నారు. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాలతోనే కాకుండా.. ప్రపంచంతోనే పోటీ పడే స్థాయికి హైదరాబాద్ చేరుకున్నదని చెప్పారు. ఐటీ సెక్టార్‌లో వచ్చిన పెట్టుబడులు, మార్పులు హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిని తీసుకొచ్చాయని తెలిపారు. ఏ నగరంలో శాంతిభద్రతలు ఉంటా యో అక్కడికే పెట్టుబడులు వస్తాయని, అందు కే తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నట్టు తెలిపారు.

### నాకు రాజకీయాలపైనే అవగాన

'నాకు రాజకీయంగానే అవగాహన ఉన్నది. అది నా వృత్తి. పరిపాలన కావాలంటే అధికారులను అడుగుతాం. ఏవైనా నిర్మించాలంటే నిపుణులను అడుగుతాం. ఇంకేమైనా కావాలంటే సీనియర్ల నిర్ణయాలు తీసుకుంటాం. కొంత ఆలస్యమైనా అనువజ్ఞుల ఆలోచనలు తీసుకుంటాం. పరిపాలనేందో అర్థం చేసుకోవడానికి నాకు కొంత సమయం కావాలి. ఏం తెలియకుండా సంతకాలు పెడితే.. శివబాలకృష్ణ ఉన్నట్టు నేను కూడా జైళ్లో ఉండాల్సి వస్తుంది' అని సీఎం రేవంత్ అన్నారు. ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా ఉండే 14 రోడ్లలో 2 నుంచి 3 వేల ఎకరాల్లో 15 క్లస్టర్లుగా ఒక్కో చోట ఒక్కో కంపెనీని విభజించి ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని వివరించారు. అక్కడే గేటెడ్ కమ్యూనిటీలు, స్కూల్స్, షాపింగ్‌మాల్స్ ఉండేలా ఏర్పాటు చేస్తామని చెప్పారు. లిమిటెడ్ ఇన్వెస్టర్లు ఒకచోట ఉంటే ఏ సమస్య అయినా సులువుగా పరిష్కారం అవుతుందని అన్నారు. త్వరలో అగ్నిమాపక శాఖలో 1000 ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. ఫైర్ డీజీ సూచన మేరకు పోలీసు శాఖలో ప్రమాదవశాత్తూ చనిపోతే వచ్చే బెనిఫిట్స్‌ను అగ్నిమాపకశాఖలో కూడా ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. పోలీసుశాఖలో ఉండే బెనిఫిట్స్ ఫైర్‌శాఖకు వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి 'మెగా మాస్టర్ ప్లాన్-2050' తీసుకొస్తామని వెల్లడించారు. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు భాగాలుగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫైర్ డీజీ వై నాగిరెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్, ఏడీజీలు సంజయ్‌కుమార్ జైన్, సౌమ్యామిశ్రా, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

# సడలింపు కొందరికే!

మొదటిపేజీ తరువాయి...

కారణాలతో రెండుసార్లు గ్రూప్ -1 పరీక్ష రద్దయింది. కొత్తగా కొలువుదీరిన రేవంత్ సర్కారు ఇటీవలే రెండేండ్లు వయోపరిమితి సడలింపునిచ్చింది. యూనిఫామేతర పోస్టులకు మాత్రమే దీనిని పరిమితం చేసింది.

### నష్టం జరుగుతుందిలా..

- పోలీసుశాఖలో డీఎస్పీ పోస్టులు 91 ఉన్నాయి. ఎంపీడీవో పోస్టుల తర్వాత ఇవే ఎక్కువున్నాయి. ఈ పోస్టులకు వయోపరిమితి 21- 31 ఏండ్లుగా ఉంది. గతంలో గ్రూప్-1కు దరఖాస్తు చేసి ఈ రెండేండ్లలో 31 ఏండ్లు నిండిన వారు ఈ పోస్టులపై అవకాశం వదులుకోవాల్సిందే.
- జైళ్లశాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ పోస్టులు 2 ఉన్నాయి. ఈ పోస్టులకు 18 -31 ఏండ్ల మధ్యవారు అర్హులు. వీటికి మినహాయింపు ఇవ్వలేదు.
- ఎక్సైజ్‌శాఖలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టులు 26 ఉన్నాయి. ఈ పోస్టులకు 21 నుంచి 31 ఏండ్ల మధ్య వయస్కులు అర్హులు. గ్రూప్-1 నోటిఫికేషన్ తర్వాత 31 ఏండ్లు దాటిన వారు ఉద్యోగాలు దక్కించుకోవడం కష్టమే.
- ఈ మూడు పోస్టులకు నోటిఫికేషన్‌లో ప్రకటించిన వయో పరిమితి నిబంధనల ప్రకారం 02-07-1991 తేదీ ముందు జన్మించినవారు అర్హులు కాదు. అంటే 1991జూలై నుంచి 1993 జూలై మధ్యలో పుట్టిన వారు తాజాగా ఈ మూడు పోస్టులకు పోటీ పడే అర్హతను కోల్పోతారు.
- ఇక యూనిఫామేతర పోస్టులకు పోటీపడే వారిలో కొంత మందికి నష్టం జరగనున్నది. గ్రూప్ -1 నోటిఫికేషన్ 2022 ఏప్రిల్ 26న విడుదలైంది. రేవంత్ సర్కారు వయోపరిమితి సడలింపునిస్తూ ఈ నెల 8న జీవోను జారీచేసింది. అంటే ఆయా తేదీ నుంచే సడలింపు అమల్లోకి వస్తుంది. ఈ రెండు తేదీల మధ్యలో వయోపరిమితి నిండిన వారు గ్రూప్-1కు పోటీ పడే అవకాశం కోల్పోతారు.

### ఎన్నికల కోడ్‌కు ముందే గ్రూప్-1 షెడ్యూల్ ప్రకటించాలి

రెండేండ్ల నుంచి అభ్యర్థులు వేచిచూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందే గ్రూప్-1 పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేయాలి. అదనపు పోస్టుల సంఖ్యను 60కి పరిమితం చేయకుండా పెంచాలి. వయో పరిమితి సడలింపును గత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వర్తింపజేయాలి.నాన్ లోకల్ అభ్యర్థులు రాకుండా ఉండేందుకు గ్రూప్-1లో తెలుగును క్వాలిఫై పేపర్‌గా పెట్టాలి. **- ప్రభాకర్ చౌటి, పోటీ పరీక్షల శిక్షకుడు**

### యూనిఫాం పోస్టులకు వయోపరిమితి పెంచాలి

ఇటీవలే ప్రభుత్వం యూనిఫామేతర పోస్టులకు మాత్రమే వయోపరిమితి పెంచింది. ఇది పూర్తిగా అన్యాయం. డీఎస్పీ, ఎక్సైజ్, జైళ్లశాఖలోని యూనిఫాం పోస్టులకు సైతం వయోపరిమితి సడలింపునివ్వాలి. వయో పరిమితి సడలింపు సహా సకాలంలో పోస్టులు భర్తీ చేయకపోతే ఉద్యమాలకు దిగుతాం. **- గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు**

# సీపీఐలో నామినేటెడ్ పదవుల చిచ్చు

- అన్ని పదవులు అగ్రవర్ణాలకేనా?
- బీసీ, ఎస్సీ, ఎస్టీవర్గాల్లో అసంతృప్తి
- తమకూ వాటా ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ పోస్టుల అంశం సీపీఐ నేతల్లో చిచ్చురేపుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీపీఐకి ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ, రెండు కార్పొరేషన్ పదవులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ఒప్పుకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా నామినేటెడ్ పోస్టులపై స్పష్టత ఇవ్వకపోవడంపై సీపీఐ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. మరోవైపు నామినేటెడ్ పదవుల విషయంలో సీపీఐలో సామాజిక న్యాయం అనే నినాదం తెర మీదకు వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించనున్న నామినేటెడ్ పోస్టులను అగ్రవర్ణాలకే కట్టబెట్టకుండా తమకూ వాటా ఇవ్వాలన్న డిమాండ్ బీసీ, ఎస్సీ, ఎస్టీ నేతల నుంచి వ్యక్తమవుతున్నది. ఇప్పటికే ఎమ్మెల్యే పదవి కూనంనేని సాంబశివరావుకు దక్కిందని, ఎమ్మెల్సీ పదవితోపాటు రెండు కార్పొరేషన్ల పదవులను కూడా అగ్ర కులాలవారికే కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అసంతృప్తి వ్యక్తమవుతున్నది. పార్టీకి వచ్చే మూడు పదవులను చాడ వెంకట్‌రెడ్డి, కే శ్రీనివాస్‌రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి వంటివారికే ఇస్తే ఇతర సామాజికవర్గాల నేతలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఒకరికి ఎమ్మెల్సీ, ఇద్దరికి కార్పొరేషన్ పదవులు దక్కుతాయని ప్రచారం జరుగుతున్నది. బాల నర్సింహ, బాల మల్లేశ్, ఎలికంటి సత్యం, ఈటె నర్సింహ వంటి వారికి ఒక్కసారైనా అవకాశం ఇస్తారా? లేదా? అన్న చర్చ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

### మీడియా అకాడమీ సీపీఐ ఖాతాలోనే..

కాంగ్రెస్ పార్టీ సీపీఐకి రెండు కార్పొరేషన్ పదవులు ఇస్తే వాటిలో ఒకటి మీడియా అకాడమీ ఉంటుందని చెప్తున్నారు. ఈ పదవికి శ్రీనివాస్‌రెడ్డి పేరును ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో ఒకసారి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా వ్యవహరించిన శ్రీనివాస్‌రెడ్డికి మళ్లీ ఇప్పుడు కూడా అదే పదవి ఎందుకు? ఇంకా ఏదైనా మంచి పదవి ఇవ్వాలన్న డిమాండ్ పార్టీ శ్రేణుల నుంచి వినిపిస్తున్నది. పార్టీ కోటాలోనే మీడియా అకాడమీ పదవిని భర్తీ చేస్తే ఒక్క కార్పొరేషన్ పదవి మాత్రమే దక్కుతుందని, దీనిని స్వతంత్ర పదవిగా పరిగణించాలని సీపీఐ నేతలు కోరుతున్నారు.

### పైరవీల జోరు

సీపీఐ నేతలు కూడా పార్టీలో ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో ఎవరికి వారే పైరవీలు చేసుకుంటున్నారు. కొంతమంది నేతలు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌లో కీలకమైన నేతల వద్దకు వెళ్లి కలుస్తున్నారు. శాసనసభ సమావేశాల సందర్భంగా చాలామంది నేతలు అసెంబ్లీ లాబీల్లో కనిపించారు. మర్యాదపూర్వకంగా మంత్రులను, ముఖ్యమంత్రిని కలిసేందుకు వచ్చామని చెప్తున్నా.. నామినేటెడ్ పదవుల పైనే దృష్టి సారించినట్టు తెలుస్తున్నది.

### సహాయకార్యదర్శుల నియామకం ఎప్పుడు?

సీపీఐలో ఇద్దరు సహాయ కార్యదర్శుల నియామకంపై పార్టీలో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. పార్టీలో రాష్ట్ర కార్యదర్శి తర్వాత.. రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవులైన అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులను భర్తీ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నారు. మొదట అసెంబ్లీ ఎన్నికల తర్వాత భర్తీ చేస్తామన్నారు.. ఆ తర్వాత జాతీయ కౌన్సిల్ సమావేశాల తర్వాత చేస్తామన్నారు. అవన్నీ పూర్తయినా అసిస్టెంట్ సెక్రటరీలను మాత్రం భర్తీ చేయలేదు. ఈ ఇద్దరు సహాయ కార్యదర్శులలో ఒకరు బీసీ, ఒకరు ఎస్సీ ఉండాలనే ప్రతిపాదన కూడా ఉన్నది. కనీసం అదైనా కార్యరూపం దాల్చలేదు. పార్టీలో బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ రోజు రోజుకూ వినిపిస్తున్నది. కనీసం ఈ పదవులు వారికి కేటాయించినా కొంత న్యాయం చేసినవారవుతారనే వాదన పార్టీలో బలంగా వినిపిస్తున్నది.

# 11 ఇసుక లారీలు గాయబ్

- భద్రాద్రి జిల్లాలో పెను దుమారం
- పోలీస్‌స్టేషన్‌లో మిగిలింది ఆరే
- పోలీస్, ఆర్టీఏ, మైనింగ్ అధికారుల పొంతనలేని సమాధానాలు

ఖమ్మం, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక దందా పెను దుమారమే రేపుతున్నది. ఇసుక రవాణా వెనుక కాంగ్రెస్ పెద్దల హస్తం ఉన్నదునే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇసుక దందా వ్యవహారంలో బూర్గంపహాడ్ పోలీసులు మొత్తం 17 లారీలను పట్టుకోగా, ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఆరు లారీలే నిలిపి ఉండటం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది. మొత్తం 12 లారీలకు సంబంధించి 12 కేసులు నమోదు చేశామని, కొందరు జరిమానా చెల్లించి తమ వాహనాలను తీసుకెళ్లారని ఆర్టీఏ అధికారులు చెప్తుండగా, మైనింగ్‌శాఖ అధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు. జరిమానా విధింపు, వాహనాల విడుదలపై తమకు ఎలాంటి సమాచారం లేదని సమాధానమిస్తున్నారు. మరోవైపు మిస్ అయిన లారీల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారంలో కూడా బూర్గంపహాడ్ పోలీసులు పెదవి విప్పకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇసుక దందా వెనుక పెద్దల హస్తం లేకపోతే అధికారులు ఎందుకు మీడియాకు వివరాలు వెల్లడించడం లేదో అంతుచిక్కడం లేదు. దీనిపై 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్‌ను వివరణ కోరగా తమ ఆధీనంలో మొత్తం 16 లారీలు ఉన్నాయని సమాధానమిచ్చారు.

### మామూళ్ల అడ్డా నాగారం

పాల్వంచ మండలంలోని నాగారం చెక్‌పోస్టు కేంద్రంగా మామూళ్ల పర్వం కొనసాగుతున్నదని, అక్రమార్కులు ఇచ్చే సొమ్ముకు లొంగి ఇసుక లారీలను విడిచిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడి అధికారులు, సిబ్బంది ప్రతి అక్రమానికి ఒక రేటు ఫిక్స్ చేసినట్టు తెలుస్తున్నది. ఓవర్‌లోడ్‌కు ఒక రేటు.. ధ్రువపత్రాలు లేకపోతే మరో రేటు వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల ఆ చెక్‌పోస్టు వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఏడు లారీలను పట్టుకున్నారు. వాస్తవానికి ఆ బాధ్యత ఆర్టీఏ అధికారులది. కానీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లారీలను ఎందుకు పట్టుకున్నారో అంతుబట్టని ప్రశ్న.

### ఏపీలోని ఇసుక రీచ్ బంద్

ఏపీలోని గుండాల ఇసుక రీచ్ నుంచి తెలంగాణకు భారీగా ఇసుక తరలుతున్నదనే అంశంపై మూడు రోజులుగా 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న కథనాలకు అక్కడి అధికారులు స్పందించారు. ఆంధ్రా నుంచి తెలంగాణలోకి రావాలంటే టన్నుకు రూ.200 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక వస్తున్నది కాబట్టి అక్రమార్కులు ప్రభుత్వానికి రుసుమేమీ చెల్లించరు. గతంలో ఈ దందా చర్ల, వెంకటాపురం మార్గంలో సాగేది. ప్రస్తుతం మేడారం జాతర కారణంగా ఆ రూట్లు బిజీగా ఉండటంతో అక్రమార్కులు భద్రాచలం మీదుగా దందా సాగిస్తున్నట్టు తెలుస్తున్నది.

# పాత్రధారి సీతక్క పీఏ.. సూత్రధారి ఎవరు?

మొదటిపేజీ తరువాయి...

మార్చుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర నెలలే అవుతున్నా... రెండు వారాల క్రితం నుంచే ఈ దందా పెరిగింది. తెలంగాణ స్టేట్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, వ్యాపారం జరుగుతుంది. రాష్ట్రంలో 40 వరకు ప్రభుత్వ అనుమతి ఉన్న ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటి నుంచి ప్రతిరోజు సగటున 80 వేల టన్నుల ఇసుక వ్యాపారం జరుగుతున్నది. కొత్త ప్రభుత్వం రాగానే పారదర్శకంగా ఉన్న పాత పద్ధతిని నిలిపివేసింది. అధికారికంగా ఇసుక రీచ్‌లలో తవ్వకాలను బంద్ పెట్టింది. ప్రభుత్వంలోని ఇద్దరుముగ్గురు ముఖ్య ప్రజాప్రతినిధులు వారి నియోజకవర్గాల పరిధిలోని గోదావరి నదిలో ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను ఇష్టం వచ్చినవారు తీసుకువెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అధికారికంగా రీచ్‌లను నిలిపివేయడంతో ప్రభుత్వానికి ఆదాయం రావడంలేదు. ఇక్కడ కీలక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయి. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీల్లో అక్రమ దందా బయటపడుతున్నది. రీచ్‌లను మూసివేయడంతో రెండువారాలుగా రాష్ట్రంలో ఇసుకకు డిమాండు పెరిగి ధరలు పెరుగుతున్నాయి. ఇదే అదనుగా ప్రభుత్వంలోని ఇద్దరుముగ్గురు ముఖ్యులు ఇసుక దందాకు తెరలేపారు. ప్రభుత్వానికి వచ్చే కోట్ల రూపాయల ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. 'నమస్తే తెలంగాణ'లో వస్తున్న వరుస కథనాలతో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రైవేటు పీఏ సుజిత్‌రెడ్డి బండారం బయటపడింది. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్న లారీలను వదిలిపెట్టేలా సుజిత్‌రెడ్డి ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలతో ఆయనను తాత్కాలికంగా పక్కనబెట్టినట్టు పైకి చెప్తున్నారు. ఒక సాధారణ పీఏ ఉన్నత స్థాయి అధికారులపై ఒత్తిడి తేవడంవెనుక ఉన్న బలం ఏమిటనే చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ పెద్దల అండతోనే సుజిత్‌రెడ్డి ఇసుక అక్రమ దందాలో కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి కోటరీలో మంత్రి సీతక్క మొదటి నుంచి కీలకంగా ఉంటున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలోనూ సీతక్క కీలకపాత్రలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకే కీలక మంత్రి పీఏ ఇసుక దందాలో బహిరంగంగా దొరికిపోవడంపై కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతున్నది. ఉన్నతస్థాయిలో ఉన్న అండదండలతోనే ఇసుక వ్యవహారంలో సీతక్క పీఏ కీలకంగా వ్యవహరించాడని అధికార పార్టీ నేతలు చెప్తున్నారు.



### వామ్మో సుజిత్‌రెడ్డి

సిరిసిల్ల జిల్లాకు చెందిన సుజిత్‌రెడ్డి అమ్మమ్మ ఊరు ములుగు మండలం దేవగిరి పట్నం. సీతక్క ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకుని సుజిత్ రెడ్డి ఆమె వద్ద చేరాడు. నడుస్తున్న ట్రెండ్ మొత్తం సోషల్ మీడియానే అని చెప్పి కొందరితో ప్రైవేటు సైన్యాన్ని తయారు చేశాడు. సీతక్క ఎటు వెళ్లినా ఆ సైన్యాన్ని వెంట పంపించి వీడియోలు, ఫొటోలు తీసి వాటికి పాటలను జోడించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు. కొన్ని రోజులకే సుజిత్‌రెడ్డి సీతక్కకు పీఏగా మారిపోయాడు. కరోనా సమయంలో సీతక్కకు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పిస్తానని తెలుపుతూ పరిచయం పెంచుకున్నాడు. సోషల్‌మీడియా బృందానికి నెల ప్యాకేజీల చొప్పున అందిస్తూ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసేవాడు. కరోనా సమయంలో గ్రామాలు, గూడేల్లో సీతక్కతోపాటు సుజిత్‌రెడ్డి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్టు తీసిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసేవి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన నేత ముఖ్య సన్నిహితులతో నేరుగా సంబంధాలు నెరుపుతూనే పీఏగా పని చేస్తూ వచ్చాడు. సీతక్క మంత్రి కాగానే దందా మొదలుపెట్టాడని అంటున్నారు. సీతక్క మంత్రి అయిన తర్వాత హైదరాబాద్ లెవల్‌లో దందాలకు తెరలేపడమే కాకుండా సీఎం పేరును, ఆయన ఫొటోలను ఇసుక లారీలకు సర్దార్ అంటూ స్టిక్కరింగ్‌లు వేయించి కోట్ల దందాకు తెరతీశాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే ములుగు నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు సైతం ఆశ్చర్యపోయేలా బిజినెస్ మ్యాన్‌గా మారిపోయాడు. లారీకి అడ్డువచ్చిన అధికారులకు ఫోన్‌లు చేసి వదలాలని హుకుం జారీ చేశాడు. సుజిత్‌రెడ్డి తీరు మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉన్నదని కాంగ్రెస్ నేతలే అంటున్నారు. సీతక్కకు పీఏగా మారిన తర్వాత సుజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలతో సంబంధాలు పెంచుకున్నాడు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం సుజిత్‌రెడ్డిని పేరు పెట్టి పిలిచేంత పరిచయం పెరిగింది. సీతక్క వెంట ఉంటూ సేవ పేరుతో కాంట్రాక్టర్లు, వ్యాపారుల నుంచి డబ్బులు వసూళ్లు చేయడం సుజిత్‌రెడ్డికి పరిపాటి అని చెప్తున్నారు. ములుగు నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్యనేతలతో సీతక్కకు మధ్య దూరం పెంచడంలో సుజిత్ ముఖ్యపాత్ర వహించాడని అంటున్నారు. చివరికి సీతక్క కుటుంబ సభ్యులు ఆమెను కలిసేందుకు వస్తే సుజిత్‌రెడ్డి అడ్డుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని చెప్తున్నారు. కాంగ్రెస్‌లో ఏ స్థాయి నేతలైనా, అధికారులు అయినా మంత్రి సీతక్కను కలవాలంటే ముందుగా సుజిత్‌రెడ్డితో మంచిగా ఉండాలనే విధంగా పరిస్థితి మారిందని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మంత్రి సీతక్కకు గవర్నమెంట్ పీఏగా తనను నియమించాలనే ప్రతిపాదన పెట్టాడు. నిబంధనలు అడ్డురావటంతో సీఎం ఆఫీస్ పీఏను అని చెప్పి అధికారులకు ఫోన్లు చేసేవాడు. ఇదే ప్రక్రియలో విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫోన్లు చేసి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీలను వదిలిపెట్టాలని ఒత్తిడి తెచ్చాడు.

### క్వారీలపై పెత్తనం ఎవరిది?

ప్రస్తుతం కాళేశ్వరం వద్ద గల 8 క్వారీల నుంచి ఇసుక రవాణా జరుగుతున్నది. కాళేశ్వరం ఏరియాలోని పలుగుల (విలాసాగర్ 3) క్వారీని నుంచి ఇసుక తరలింపును నిలిపివేయడంపై లారీ యజమానులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్వారీలో నాణ్యమైన ఇసుక ఉన్నదని, కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ఈ క్వారీని కావాలనే మూసివేశారని ఆరోపిస్తున్నారు. కాళేశ్వరం ఏరియాలోని క్వారీలపై ఆధిపత్యం చెలాయిస్తున్న ఒక అధికారి, ప్రభుత్వ పెద్దల అండదండలతో ఇసుక కృత్రిమ కొరత సృష్టిస్తున్నాడని, అతని కనుసన్నల్లో అక్రమ దందా యధేచ్ఛగా కొనసాగుతున్నదని చెప్తున్నారు. ఇసుకను తీసుకెళ్లేందుకు బుకింగ్‌తో వచ్చిన ప్రతిలారీ నుంచి రూ1000 చొప్పున వసూలు చేస్తున్నారని అంటున్నారు. ప్రతిరోజు 350 లారీలు ఈ క్వారీకి వస్తున్నాయని, ఇలా సగటున రూ.3.50 లక్షల వరకు ముట్టజెప్పాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వంలోని ముఖ్యుల అండతోనే ఆ అధికారి ఇలా చేస్తున్నాడని, హైదరాబాద్‌లోని ఉన్నతాధికారికి సైతం ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. ములుగు జిల్లాలోని 102 ఎకరాల్లో 11 ఇసుక క్వారీలను మైనింగ్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. కేసీఆర్ ప్రభుత్వ హయంలో పీసా గ్రామ సభలను నిర్వహించి ఆదివాసీ సంఘాలు, నిబంధనల మేరకు ఇతరులకు ఈ క్వారీలను కేటాయించారు. మంగపేట మండలం మల్లూరు, చుంచుపల్లిలో... వాజేడు మండలం అయ్యవారిపేట, ధర్మవరం, రాంపూర్‌లో... వెంకటాపురం (నూగూరు) మండలం మొర్రివానిగూడెం, శ్రీరంగపురం, కే కొండాపురం, వంటి చింతగూడెంలో క్వారీలు ఉన్నాయి. ప్రస్తుతం వెంకటాపురం (నూగూరు) మండలంలో రెండు క్వారీలు, వాజేడు మండలంలో మూడు క్వారీలు కొనసాగుతున్నాయి. 19 లక్షల 56 వేల 666 టన్నుల సామర్థ్యంతో ఇసుక క్వారీలను నిర్వహిస్తున్నారు. పీసా గ్రామ సభల ఆమోదం లభించకపోవడంతో క్వారీలు ఇసుక కొరత ఏర్పడుతున్నదని మైనింగ్ శాఖ అధికారులు చెప్తున్నారు. మేడారం జాతర సందర్భంగా రవాణా ఇబ్బందులు లేకుండా వరంగల్-ములుగు-ఏటూరునాగారం రోడ్డులో ఇసుక లారీల రవాణాను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. జాతర ముగిసే వరకు ఈ మార్గంలో ఇసుక రవాణా జరిగే అవకాశం లేదు. ఇది ఇసుక అక్రమ వ్యాపారం చేసేవారికి మంచి అవకాశంగా మారింది.